మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



ఉట్నూర్ : హరితహారంలో భాగంగా మండలంలో ప్రతి గ్రామంలో నాటిన మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని గోండుగూడ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో నాటిన మొక్కలను ఎంపీడీవో తిరుమలతో కలిసి పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా నీరు పోశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నాటిన మొక్కలకు పంచాయతీ సిబ్బంది క్రమం తప్పకుండా నీరు పోయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హరితహారంలో నాటిన మొక్కలను కాపాడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. అదే విధంగా ఘన్పూర్ పంచాయతీ పరిధిలోని చింతగూడ గ్రామంలో ఎంపీపీ పర్యటించారు. గ్రామస్తులతో పలు విషయాలపై చర్చించారు. వారి వెంట ఈజీఎస్ ఏపీవో రజనీకాంత్, పంచాయతీ కార్యదర్శి ఘన్‌శ్యాం ఉన్నారు.

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

1

శనివారం 07 జనవరి 2023

కొనసాగుతున్న మిషన్ భగీరథ కార్మికుల రిలే దీక్షలు



ఆసిఫాబాద్ : మూడు నెలలు పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌తో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ మాట్లాడుతూ గతంలో భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐపీఎఫ్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ బాలేష్, దుర్గం లింగయ్య, గౌతమ్, రవీందర్, శ్రీకాంత్, భీమ్ రాజ్, బుడ్డయ్య, మహేష్ , రాందేవ్, సాగర్, విట్టల్, గౌరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పించాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల వారీగా స్థానికుల అవసరాలను దృష్టితో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీపీ గోదరి రమాదేవి లక్ష్మణ్ కోరారు. మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు, ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టనున్న గ్రామ పంచాయతీ పరిధి అభివృద్ధి పనుల విషయమై ప్రణాళికల తయారుపై చర్చించారు. ఈ నెల 9 నుండి గ్రామ పంచాయతీల వారిగా స్థానిక సర్పంచ్ అధ్యక్షతన సమావేశమై గ్రామ పంచాయతీ ప్రజల అవసరాలకు ప్రాధాన్యత కల్పిస్తూ 9 అంశాలతో కూడిన అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, చెన్నూర్ ఎంపీఓ అజ్మత్ అలీ, మండల పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్లాంకెట్లు, స్వెటర్లు పంపిణీ



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని ఎల్లూరు ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉలన్ బ్లాంకెట్లు, స్వెటర్లను సర్పంచ్ దుర్గం రాజన్న అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ద్వారా వచ్చిన బ్లాంకెట్లు, స్వెటర్లను విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు సాజిద్, ఆదివాసీ నాయకులు అశోక్, భుజంగరావు పాల్గొన్నారు.

తెలంగాణ మాలమహానాడు క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - దహెగాం

మండల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ మాలమహానాడు నూతన సంవత్సరం క్యాలెండర్‌ను తహసీల్దార్ మల్లెపూల మధుకర్, ఎస్ఐ సనత్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుంద్ర శ్రీనివాస్, మండలాధ్యక్షుడు నరేష్, యూత్ అధ్యక్షుడు సొత్కు సాయికుమార్, ఉపాధ్యక్షుడు రమేష్‌తో పాటు నాయకులు తిరుపతి, రఘు, మహేష్, రాకేష్ పాల్గొన్నారు.

నేటి వర్చువల్ సమావేశం విజయవంతం చేయాలి

నవతెలంగాణ-గుడిహత్నూర్

ఇచ్చోడ మండల కేంద్రంలోని గంగారెడ్డి గార్డెన్‌లో శనివారం జరగనున్న బీజేపీ వర్చువల్ సమావేశం విజయవంతం చేయాలని బోథ్ అసెంబ్లీ పాలక్ కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని మన్నూర్, మచ్చాపూర్, గూడిహత్నూర్ పంచాయతీల్లో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో విస్తృత సమావేశాలు నిర్వహించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు వర్చువల్ సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారని తెలిపారు. బూత్ కమిటీ సభ్యులు, శక్తి కేంద్రాల సభ్యులు హాజరు కావాలని సూచించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఎంపిపి భరత్, మండలాధ్యక్షుడు లింగాపూర్ సర్పంచ్ జాడి సుభాష్, నాయకులు జాదవ్ విజయ్‌కుమార్, జగన్, శంకర్ ఉన్నారు.

కొండయ్య మహారాజ్ గురుపూజ వేడుకలు

నవతెలంగాణ - కౌటాల

మండలంలోని గుండాయిపేట గ్రామంలో కొండయ్య మహారాజ్ 51వ గురుపూజ వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మహారాజ్ పల్లకిని గ్రామంలో వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భజన, మంగళ హారతులు, మంగళ వాయిద్యాలతో వేడుక నిర్వహించారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ మందిర్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడె సునీత, ఉప సర్పంచ్ చాప్లె లహంచు, రాజమౌళి, బండయ్య, సంతోష్, భక్తులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్

స్కీం వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్కీం వర్కర్ల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అచ్చేదిన్ పేరుతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఎనిమిదేళ్ల కాలంలో స్కీములను, స్కీమ్ వర్కర్ల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. స్కీమ్ వర్కర్ల రక్షణ, స్కీముల సంరక్షణ, హక్కుల సాధన కోసం స్కీం వర్కర్లందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దేశ వ్యాప్తంగా స్కీం వర్కర్లు పోరాటాలకు అనివార్యంగా రాక తప్పడం లేదని తెలిపారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఐకేపీ వివోఏలు, సర్వ శిక్ష అభియాన్ తదితర 72 స్కీములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో నడుస్తున్నాయన్నారు. వీటి ద్వారా ప్రజలకు సంక్షేమం అందడంతో పాటు ప్రభుత్వాన్ని కూడా ప్రచారానికి ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. కానీ స్కీం వర్కర్ల ఉద్యోగ భద్రత, సంక్షేమం, జీతాల పెంపు, ఉద్యోగ భద్రతను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా కోటి మంది, తెలంగాణ రాష్ట్రంలో నాలుగు లక్షల మంది స్కీం వర్కర్లు 40 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్నారని, వీరిలో అత్యధికులు మహిళలు బడుగు బలహీన వర్గాలే ఎక్కువగా ఉన్నారన్నారు. కరోనా సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రజల ప్రాణాలను కాపాడిన స్కీం వర్కర్ల త్యాగం వెలకట్టలేనిదని తెలిపారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా స్కీం వర్కర్లకు రూ.26,000 వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనం నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పే యత్నాలు విరమించుకోవాలని ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.పద్మ, లక్ష్మి, స్రవంత, సుధారాణి, రాజేశ్వరి, గౌరబాయి, అంగన్వాడీ, ఆశా, ఎండీఎం, ఐకేపీ తదితర రంగాల కార్మికులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో..



ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ : స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, ఐకెపి వివోఏ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి విమర్శించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పోచయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో కొచ్చి 8సంవతసరాలు అవుతోందని, ఈ కాలంలో స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ప్రజలకు చేరవేయడంలో స్కీం వర్కర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ స్వప్న, పూజ, దేవత, కవిత, అమృత, దేవి, శోభ, జమున, లక్ష్మి, అంగన్వాడీ, ఐకెపి వివోఏలు వనిత, సరోజ, అర్చన, కల్పన, ఫైమ, జయ, శారద, కవిత, రమాదేవి, ప్రమోద్, బుద్దు, రమేష్, భీంరావు పాల్గొన్నారు.

కౌటాల : సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ముందు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులు సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కోకన్వీనర్ మోర్లె నాగేష్ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మునావర్ షెరీఫ్‌కు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, హమాలీ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్ల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ స్కీముల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆశా వర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దార్ ఫారూఖ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్, ఆశా వర్కర్ల సంఘ బాధ్యులు రజిత, సునీత, పద్మ త్రివేణి, సంధ్య, సిఐటియు కార్యకర్తలు గంగాధర్, నరేష్, నాగరాజు పాల్గొన్నారు.

బాసర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ నారాయణకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించడం లేదన్నారు. ఐసీడిఎస్, ఎండిఎం, మెడికల్, హెల్త్ విభాగాలను ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలంటే పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. కనీస వేతన జీవోను సవరించి కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి, జిల్లా ఉపాధ్యక్షురాలు శైలజ, శశికళ, భూలక్ష్మి, రత్నమాల, కవిత, రమ్య, లావణ్య, పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేశ వ్యాప్తంగా జరిగే నిరసనలో స్కీం వర్కర్లందరు పాల్గొని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి ఆధ్వర్యంలో తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్, ఎన్‌హెచ్‌ఎం తదితర స్కీంల ప్రయివేటీకరణను ఆపాలని, బడ్జెట్ పెంచాలని, డిజిటల్ హెల్త్ మిషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రకళ, రాజమణి, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, శ్రీలత, సుజాత, శిరీష, కారోబార్‌లు శ్రీకాంత్, చంద్రశేఖర్, మేస్త్రీసంఘం సభ్యుడు రవి, ఐకేపీ, మధ్యాహ్నభోజన కార్మికులు పాల్గొన్నారు.

జైపూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని సీఐటీయూ నాయకులు కుంటాల కుమార్ విమర్శించారు. ప్రభుత్వాల తీరులో మార్పు రావాలని, పథకాల అమలుకు సంబంధించిన బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన తహసీల్దార్ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 8 సంవత్సరాలుగా అధికారంలో ఉండి సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఒక వైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, మరో వైపు చాలీ చాలని వేతనాలతో పని చేస్తూ వర్కర్లు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఈ పథకాలను నిర్వీర్యం చేయడం కోసం అనేక వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోలి మాధవరెడ్డి, సుందిల్ల లింగయ్య, సరిత, సుజాత, పద్మ, లక్ష్మి, మౌనిక, రాజలక్ష్మి సిరిపురం శ్రీను, రూపేశ్ పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో..



బాసరలో..

ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు సన్నాహాలు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కాలరీస్ కంపెనీ సోలార్ విద్యుత్తు ఉత్పత్తి రంగంలో మరో కొత్త కోణం పరిచయం చేయబోతుంది. మండలంలోని పెగడపల్లి శివారుల్లో సంస్థ ఏర్పాటు చేసిన 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఆవరణలో ప్రయోగాత్మకంగా ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించబోతుంది. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించిన రిజర్వాయర్‌పై ఏర్పాటు చేస్తున్న 5 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా ఈ నెల 15న ఉత్పత్తి ప్రారంభించడానికి సంస్థ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో సీఎండీ ఎన్ శ్రీధర్ విద్యుత్ సమీక్షా సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సింగరేణి కాలరీస్ రెండేళ్ల కాలంలో 8 చోట్ల 219 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్లు ఇప్పటి వరకు 505 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను విజయవంతంగా ఉత్పత్తి చేస్తుంది. తర్వాత ఇప్పటి వరకు కంపెనీకి రూ.300 కోట్ల ఆదా జరిగింది. 3వ దశ సోలార్ ప్లాంట్ల నిర్మాణంలో భాగంగా సింగరేణి సంస్థ థర్మల్ విద్యుత్ కేంద్రాంలో మూడు టీఎంసీల రిజర్వాయర్ నీటిపై 15 మెగావాట్ల సామర్థ్యంతో రెండు ఫ్లోంటింగ్ సోలార్ ప్లాంట్లు నిర్మించ తలపెట్టింది. వీటిలో తొలి దశలో నిర్మించిన 5 మెగాట్ల ప్లాంటును ఈ సంక్రాంతి లోపు ప్రారంభించాలని సంస్థ సీఎండీ ఆదేశించారు. దీని కోసం డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రిజర్వాయర్‌పై నిర్మాణంలో



ఉన్న మరో 10 మెగావాట్ల ప్లాంట్ పనులను కూడా శరవేగంగా పూర్తి చేయాలని, మార్చి నాటికల్లా ఈ ఫ్లోటింగ్ ప్లాంట్‌ను కూడా ప్రారంభించాలని సంస్థ సీఎండీ స్పష్టం చేశారు. వీటితో పాటు 3వ దశలో నిర్మించే మరో 66 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు ప్లాంటను కూడా ఈ ఏడాది జూలై నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే మూడు దశల్లో 219 మెగావాట్ల ప్లాంట్లను పూర్తి చేసిన సింగరేణి మూడో దశ ప్లాంట్లను కూడా పూర్తి చేసి మొత్తం 300 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు అవుతుందని సంస్థ వెల్లడించింది.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



నవతెలంగాణ - దహెగాం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నరాసం మార్కెట్ యార్డులో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. అసంపూర్తిగా ఉన్న జూనియర్ కళాశాల భవనాన్ని పూర్తి చేయిస్తానన్నారు. అందవెల్లి పెద్దవాగు వంతెన పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. గ్రామాల్లో దెబ్బతిన్న ప్రధాన రోడ్ల రెన్యూవల్ బీటీ పనులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ బురద రోడ్డు లేకుండా గల్లీ గల్లీకి సీసీ రోడ్డు వేయిస్తానన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఇబ్బందులను తొలగించే ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, జెడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు, ఎంపీపీ సులోచన, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బండ కృష్ణమూర్తి, మార్కెటింగ్ శాఖ డీఈ శ్యాముల్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల మహాసభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ - జైనూర్

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల రాష్ట్ర ప్రథమ మహాసభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి కోరారు. శుక్రవారం జైనూర్, సిర్పూర్(యు) మండలాల్లోని కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లతో కలిసి ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల శ్రమను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వారికి ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కేజీబీవీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 18 ఏండ్ల నుండి పనిచేస్తున్న వర్కర్ల సమస్యలను విస్మరించి కనీసం గుర్తింపు కార్డు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కర్లకు గుర్తింపు కార్డు ఇస్తేనే ఉద్యోగభద్రత ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రమశిక్షణగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కేజీబీవీలను ఇంటర్ మీడియట్ వరకు పెంచి నాన్ టీచింగ్ వర్కర్లను నియమించకపోవడంతో ఉన్న వర్కర్లపై భారం పెరిగిందని పేర్కొన్నారు. పని భారం ఎక్కువ కావడంతో నాన్ టీచింగ్ వర్కర్లు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న వర్కర్లు ఈ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎఫ్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు రసబొట్టు రమ్య, కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షురాలు శైలజ, అనిత, శకుంతల పాల్గొన్నారు.

పోలీస్ నియామక ఈవెంట్స్‌లో సవరణ చేయాలి



రెబ్బెన : పోలీస్ నియామక ప్రక్రియలో భాగంగా కానిస్టేబుల్, ఎస్ఐ ఎంపికకు నిర్వహించిన ఈవెంట్స్‌లో సవరణ చేయాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పురుషోత్తం ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాంగ్‌జంప్ నాలుగు మీటర్లకు పెంచడం, ఎత్తును డిజిటల్ విధానంలో కొలవడం వంటి వాటితో అభ్యర్థులు నష్టపోతున్నారన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చాపిడి శివ పాల్గొన్నారు.

సలహాలు తీసుకొని లాభాలు పొందాలి

నవతెలంగాణ - కౌటాల

రైతులు వ్యవసాయాధికారుల సలహాలు తీసుకొని పంటల సాగులో లాభాలు పొందాలని మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండాయిపేట రైతువేదికలో యాసంగి పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు ఆశించే చీడపీడల నివారణపై అవగాహన కల్గి ఉండాలన్నారు. యాసంగి పంటలో చీడపీడలను గుర్తించిన వెంటనే మందులు పిచికారి చేయాలని తెలిపారు. ఏఏ పంటలకు ఏ రకమైన వ్యాధులు వస్తాయి, వాటికి ఎలాంటి మందులు పిచికారి చేయాలో సూచించారు. ప్రతి రైతు సాగుచేస్తున్న యాసంగి పంటలను నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడి సునీత, ఉప సర్పంచ్, రైతు సమన్వయ సమితి గ్రామాధ్యక్షుడు చాపిలె లాంచు పటేల్, ఏఈఓ చౌదరి అంజన్న, రైతులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

నవతెలంగాణ- గుడిహత్నూర్

సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మానందం అన్నారు. శుక్రవారం మండలంలోని దంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న ఎస్సీ కమ్యూనిటీ భవనం కొరకు ఎమ్మెల్యే సీడీపీ నిధుల ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును గ్రామస్తులకు అందజేశారు. అనంతరం సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.40వేల చెక్కును త్రిష కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కొరకు ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు కృషి చేస్తున్నారని వెల్లడించారు. ప్రజలందరూ బీఆర్ఎస్ కు అండగా నిలవాలని కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ రాథోడ్ ప్రతాప్, నాయకులున్నారు.

కొట్పా చట్టం ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

కొట్పా చట్టం ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తామని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు దుకాణ యజమానులకు కోట్ప చట్టంపై అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తుల ప్రచారం నేరమని తెలిపారు. దుకాణ యజమానులు విధిగా బహిరంగ ధూమపానం నేరం, పొగతాగడం ఆరోగ్యానికి హానికరమని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. స్మోకింగ్ పాయింట్లు తొలగించాలని తెలిపారు. స్మోకింగ్ పాయింట్ల వద్ద లభించే ఒక్కో సిగరెట్ ముక్కపై రూ. 200 చొప్పున జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తికి వన్ టౌన్ ఎస్ఐ హరిబాబు సమక్షంలో జరిమానా విధించారు. ఆయన వెంట పొగాకు నియంత్రణ విభాగం సామాజిక కార్యకర్త చిరంజీవి ఉన్నారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం



నవతెలంగాణ-నిర్మల్

స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. దేశవ్యాప్త నిరసనలో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో నిరసన నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు గడుస్తున్న స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఒకవైపు ఆకాశనంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు, మరోవైపు చాలిచాలని వేతనాలతో కేంద్రం, రాష్ట్రం ప్రవేశపెట్టిన స్కీమ్‌లలో పని చేస్తున్న వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం స్కీమ్ వర్కర్లను చట్ట పరిధిలోకి తీసుకురావడానికి నిరాకరిస్తోందని అన్నారు. వారి సంక్షేమం గాలికి వదిలేస్తుందని, పైగా స్కీమ్‌లను నిర్వీర్యం చేసే అనేక నిర్ణయాలను తీసుకొస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యంగా వహిస్తుందన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన, గ్రామీణ ఉపాధి హామీ, ఎన్‌హెచ్‌ఎం, ఐకేపీ వీఓఏ, సర్వశిక్ష అభియాన్ తదితర 72 స్కీమ్‌లు దేశ వ్యాప్తంగా పనిచేస్తున్నాయని అన్నారు. దేశ వ్యాప్తంగా ఒక కోటి మంది, రాష్ట్రంలో మూడున్నర లక్షల మంది స్కీమ్ వర్కర్లు పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో అత్యధికులు మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలకు చేరవేయడంలో స్కీం వర్కర్లు కీలక పాత్ర పోశిస్తున్నారని అన్నారు. అయినా వీరికి ఎలాంటి చట్ట బద్దత సౌకర్యాలు కల్పించకుండా నేటికీ ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. దేశ వ్యాప్తంగా స్కీమ్ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కరం కోసం అనేక పోరాటాలు నిర్వహించామన్నారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, స్కీమ్‌ల ప్రయివేటీకరణ ఆపాలని తీర్మానం చేసిందన్నారు. ఈ నిర్ణయం జరిగి 8 సంవత్సరాలు దాటిందని అన్నారు. స్కీమ్‌ల పట్ల కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించడం లేదన్నారు. పైగా ప్రయివేటికరణ విధానాలు ఐసీడీఎస్, ఎండీఎం, మెడికల్, హెల్త్‌లో అమలు చేయాలని అనేక ప్రయత్నాలు చేస్తుందన్నారు. అనేక రంగాలలో విపరీతంగా పని బారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచుతుందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలంటే పోరాటం తప్ప మరో మార్గం లేదని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ.రాజమణి, జిల్లా ఉపాధ్యక్షురాలు శైలేజా, శశికళ, భూలక్ష్మి, రత్నమాల, కవిత, రమ్య, లావణ్య, దేవి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, బాగ్య, స్కీమ్ వర్కర్‌లు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: స్కీమ్‌ల రక్షణ, స్కీమ్ వర్కర్ల హక్కుల సాధనకై సీఐటీయూ అఖిల భారత కమిటీ ఇచ్చిన దేశవ్యాప్త నిరసన పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాష్ట్రంలోని స్కీమ్ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీమ్‌ల రక్షణ, స్కీమ్ వర్కర్ల హక్కుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సుజాత, జిల్లా నాయకురాలు జి.పార్వతి, మధునిక, నాయకులు విమల, పార్వతి, ప్రమీల, శోభ, సురేఖ, మల్లికాంబ, ఆర్. మంజుల పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: ఆశాలు, అంగన్‌వాడీ, ఉపాధి హామీ, ఐసీడీఎస్, ఐకేపీ తదితర స్కీమ్‌లలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కవిత రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం అమలుపర్చాలని, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతి కార్మికునికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కేంద్ర ప్రభుత్వానికి సిపారసు చేయాల్సిందిగా తహసీల్దార్‌ని కోరారు.వినతిపత్రం అందజేసిన వారిలో శారధ, విజయ, రత్నామాల ఉన్నారు.

ఉట్నూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సునీత, జిల్లా నాయకురాలు రత్నమాల డిమాండ్ చేశారు. శుక్రవారం దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా ఉట్నూర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పథకాల ప్రయివేటీ కరణను అపాలన్నారు. పథకాలకు బడ్జెట్‌ను పెంచి బలోపేతం చేయాలని, కార్మికులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘం నాయకులు ముక్తా, కమల, పద్మ, పార్వతీ ఉన్నారు.

ఇచ్చోడ: దేశవ్యాప్తంగా 72 స్కీమ్‌లలో కోటి మంది, తెలంగాణ రాష్ట్రంలో మూడున్నర లక్షల స్కీమ్ వర్కర్లు 40 సంవత్సరలుగా పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో సీఐటీయూ అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు సురేందర్, జితేందర్‌లు మాట్లాడుతూ ఐసీడీఎస్, ఎండీఎంఎస్, ఎన్ హెచ్‌ఎం, తదితర స్కీమ్‌ల ప్రయివేటికరణ ఆపాలని కోరారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రతా కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కోకన్వీనర్ అశోక్, నాయకులు ముక్కెర రాజేశ్వర్, సిరిసిల్ల భూమన్న, దుబ్బాక సుభాష్, ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు లక్ష్మి, ఆశాలు లలిత, ఆశమ్మ, గంగామణి, సాగరిక, అనుబాయి, మంగుబాయి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: తెలంగాణ స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ విద్యార్ధి సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. శుక్రవారం నాడు స్థానిక అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలచే చాలిచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని అన్నారు. అంగన్‌వాడిలు, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్, ఉద్యోగ భద్రత, లేబర్ ఇన్సూరెన్స్ వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. దానిలో భాగంగానే సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాల్లోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ముందు నిరసనను చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం దీనితో కూడిన వినతపత్రాన్ని స్థానిక తహసీల్దార్ ముజం సోముకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఉయిక విష్ణు, అంగన్‌వాడీ వర్కర్లు సుభద్ర, అర్జునే ఖుషి వర్త, కమల, రాజనర్సు, భగీరథ, అనసూయ పాల్గొన్నారు.

తలమడుగు: స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. దేశ వ్యాప్తంగా అత్యంత పేదలకు విద్యా, వైద్యం, పోషక ఆహారం ఉపాధి అందించడానికి ముఖ్యమైన పథకాల్లో పని చేస్తున్న వర్కర్ల సమస్యలను కేంద్రం నిర్లక్ష్యం చేస్తుం దన్నారు. పేదలకు పోషక ఆహారం అందిస్తున్న ఐసిడిఎస్ మధ్యాహ్న భోజనం, ఉపాధి హామీ ఆశ రంగాలను ప్రయివేటు పరం చేయడానికి, వాటికి బడ్జెట్ లో కోతలు విధించడం వాటిని పేదలకు ఉచితంగా అందకుండా నిర్లక్ష్యం చేస్తుంద ని తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ఇండియన్ లేబర్ కాంగ్రెస్ (ఐ ఎల్ ఓ) లాంటి సంస్థలు కార్మికులుగా గుర్తించాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతనాలు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్కర్ల సమస్యలు కేంద్రం పెడ చెవినా పెడుతుందని విమర్శించారు. సుప్రీం కోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు ఇచ్చిన అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించేంత వరకు సిఐటియు రాష్ట్ర కమిటీ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం సిఐటియు జిల్లా అధ్యక్షులు బొజ్జ అశన్న, కళావతి,అనసూయ, రాధ, సంగీత, మంజుల, దేవుబాఈ,భాగ్యమ్మ రాధ ,తదితరులు పాల్గొన్నారు.







పాఠశాలల్లో మౌలిక వసతుల కోసమే మన ఊరు మన బడి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసమే మన ఊరు మన బడి కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని ఎంపీపీ పోటే శోభ అన్నారు. శుక్రవారం జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో రూ.1.94 కోట్లతో నిర్మించ తలపెట్టిన అదనపు తరగతి గదులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలను ప్రయివేటుకు ధీటుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో పలు అభివృద్ధి నిధులను కేటా ఇస్తోందని అన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో గదుల నిర్మాణం, వంట గదులు, ప్రహారీ గోడలు తదితర పనులను చేపట్టుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్‌సింగ్ తీలావత్, జెడ్పీటీసీ అర్క పుష్పలత, సర్పంచ్ కోరేంగ గాంధారి, చైర్మెన్ మారుతి డోంగ్రే, నాయకులు సోఫియాన్, అంజాద్, లింగన్న ఉన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

రెండో విడుత కంటి వెలుగు కార్యమాన్ని వియవంతం చేయాలని ఎంపీపీ మహిపాల్ రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో కంటి వెలుగు పథకంపై మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగు తెలంగాణ రాష్ట్రంలో కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఈ పథకం రూపుదిద్దుకుందని అన్నారు. మన మండలంలో ఈ నెల 18 నుండి మే 19 వరకు ఉంటుందని అన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రజా ప్రతినిదులు సహయసహకారాన్ని అందించాలని సూచించారు. ఈ పథకాన్ని ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా అన్ని మండలాల్లోని ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, సూపరింటెండెంట్ శ్యామ్ సుందర్‌రెడ్డి, వైద్యులు ఎండీ అలీ, అంజూ, పర్యవేక్షకులు కె.ఎం గౌడ్, ఆరోగ్య సిబ్బంది.

లక్ష్మణచాంద: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక రూపొందించాలని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరుద్దీన్, తహసీల్దార్ కవిత రెడ్డి, ఎస్సై రాహుల్ గైక్వాడ్, వైద్యాధికారి శ్రీకాంత్, ఎంపీటీసీలు గణేష్, అనిత, సురేష్, రమ ముత్యం, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా హీరాసుక జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

హీరాసుక జయంతి వేడుకలను ఆదివాసీ హీరాసుక పర్ధాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఇందిరనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించుకున్నారు. కాలనీలోని హీరాసుక ఆలయం వద్ద ఆదివాసీ సాంప్రదాయాలకు అనుగుణంగా పూజారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆదివాసీ సాంప్రదాయ డోలు, కిక్కిరి వాయిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకలకు డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా హీరాసుక విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమితి ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మెన్‌లో పాటు ఆదిలాబాద్, జైనథ్ మార్కెట్ చైర్మెన్లుగా నియమితులైన వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దుర్వ నగేష్, జైనథ్ ఏఎంసీ చైర్మెన్ వర్ష, నాయకులు మనోహర్, మెస్రం కృష్ణ, గోడం సునీల్, అదిలాబాద్ మార్కెట్ చైర్మెన్ కుమ్ర విజయలక్ష్మిరాజు, రామేశ్వర్, అశోక్, దివ్య పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని బోస్రా గ్రామానికి చెందిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోస్రా గ్రామానికి చెందిన సొంటకే శివ (26) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న క్రమంలో శుక్రవారం ఎలుకల మందుతాగి జాతర్ల గ్రామ శివారలోని నీటి కుంటలో పడి ఆత్మహత్య చేసుకున్నట్టు పేర్కొన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి ఆరా తీయగా, బోస్రా గ్రామానికి చెందిన సొంటకే శివగా గుర్తించారు. సొంటకే శివ మృతిపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ఆస్పత్రికి తరలించారు. తండ్రి నగేష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలతో సహా అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని టీటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఓస శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పదోన్నతుల అనంతరం ఫీడర్ క్యాడర్లలో ఏర్పడే ఖాళీలతో సహా మొత్తం ఖాళీలను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయాలన్నారు. ప్రత్యక్ష నియామకాలు జరిపేలోగా విద్యాబోధనకు ఆటంకం కలుగకుండా పాఠశాలల్లో తాత్కాలిక విద్యా వాలంటీర్లను నియమించాలన్నారు. 2019లో స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రెడ్ చేసిన 10,479 పండిట్, పీఈటీ పోస్టులపై గల న్యాయ వివాదాలను పరిష్కరించి, పదోన్నతులు ఇవ్వాలన్నారు. సీఎం కేసీఆర్ హామీ ప్రకారం 5,571 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలన్నారు. అన్ని జిల్లాలకు డీఈఓ పోస్టులు, నియోజకవర్గానికి ఒక డిప్యూటీ ఈఓ పోస్టును, ప్రతి మండలానికి ఒక ఎంఈఓ పోస్టును మంజూరు చేయాలన్నారు. విద్యాశాఖలో జీఓ 158 ద్వారా లోకల్ క్యాడర్‌గా క్లాసిఫై చేయబడిన డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, డైట్, బీఈడీ కాలేజీ లెక్చరర్ పోస్టులకు జీఓ 255, 256, 257 ల ద్వారా లోకల్ క్యాడర్లుగా క్లాసిఫై చేయబడిన విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలన్నారు. జీఓ 317 అమలు కారణంగా ఏర్పడిన సీనియారిటీ, స్పెషల్ క్యాటగిరీ అప్పీల్స్ అన్నింటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. హోల్డ్‌లో ఉంచిన 13 జిల్లాలలో అలాగే మిగిలి పోయిన 19 జిల్లాలలో భార్యాభర్తల బదిలీలు నిర్వహించాలని అన్నారు. జీఓ 317 అప్పీల్స్ పేరుతో చేస్తున్న అక్రమ బదిలీలను నిరోధించాలన్నారు. చేసిన బదిలీలను రద్దు చేయాలన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ కోసం స్వచ్ఛ కార్మికులను సర్వీస్ పర్సన్స్‌ను ప్రత్యేకంగా నియమించాలని కోరారు. ఇంగ్లీషు మీడియం బోధన కోసం ప్రత్యేకంగా అదనపు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. వేతనాలను ఒకటిన విడుదల చేయాలని అన్నారు., సప్లిమెంటరీ బిల్లులను వరుస క్రమంలో జాప్యం లేకుండా మంజూరు చేయాలన్నారు. సమావేశంలో దిలావర్‌పూర్ మండల అధ్యక్షులు నర్సయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలి

నవతెలంగాణ- కుభీర్

మండలంలోని ఆయా గ్రామంలో ఉన్న ప్రజలు కంటి పరీక్షలు చేసుకునేలా చూడాలని మండల అభివృద్ధి అధికారి కవిరాజ్ అన్నారు .శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల అధ్యక్షురాలు తూము లక్ష్మీ బాయి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు,ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు ప్రభుత్వం ద్వారా ప్రతి గ్రామంలో ఈనెల 18 తేదీ నుంచి కంటి వెలుగు కార్యక్రమం ఏర్పటు చేయడం జరుగుతుందని తెలిపారు.దీనికి ఆయా గ్రామంలో ఉన్న ప్రజలు అందరు సహకరించి గ్రామంలో కంటి సమస్యలు ఉన్నా వారికి పరీక్షించి వారికి అవసరమైన వైద్య సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, టిఆర్ ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, వైద్యులు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రిలో మొదటి సిజేరియన్ కాన్పు

- తల్లీబిడ్డ క్షేమం



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రసవాల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లకుండా వైద్యులు ముందుకు వచ్చి సీజేరియన్ చేసి అరుదైన ఘటనగా పేర్కొన్నారు. ఉట్నూర్ ప్రభుత్వ వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం... కుమురం భీం అసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండలం బంబార గ్రామానికి చెందిన గిరిజన గర్భిణీ సోయం సోంబాయి పురుటి నొప్పులతో గురువారం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. పురుటి నొప్పులతో బాధపడుతున్న గిరిజన గర్భిణీని పరీక్షించిన వైద్యులు ఆమెకు తీవ్ర రక్తహీనతతో బాధపడటంతో పాటుగా రక్తం తక్కువగా ఉందని తెలిపారు. ముఖ్యంగా హైపటైటిస్(బి) పాజిటివ్, బీపీ ఎక్కువగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ జాధవ్ ఉపేందర్‌కి సమాచారం అందించారు. స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంటనే ఆ మహిళ దగ్గరికి వెళ్లి మీరు వెంటనే రిమ్స్ వెళ్లాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఆమె రిమ్స్‌కు వెళ్లనని మొండికేయడంతో వెంటనే మహిళ ప్రత్యేక వైద్యనిపుణులు డాక్టర్లు శ్వేతా, మమత, అనస్థీషియా డాక్టర్లు బండారి నరేందర్, సతీష్, ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ మహేందర్, నర్సింగ్ సూపరింటెండెంట్ జాడి విమల, సిబ్బందితో కలిసి ఉట్నూర్ ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో సిజేరియన్ కాన్పు చేసినట్లు సూపరింటెండెంట్ జాధవ్ ఉపేందర్ పేర్కొన్నారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. బాలింతకి పౌష్టికాహారం కిట్‌తో పాటుగా, కేసీఆర్ కిట్‌ను అందించారు.

ఆస్పత్రిలో మొదటి సీజేరియన్ కాన్పు

ఏజెన్సీ కేంద్రంగా గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉట్నూర్ కేంద్రంగా అప్పటి ప్రభుత్వం 1985లో ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. దశాబ్దాల కాలంగా ప్రభుత్వ ఆస్పత్రిలో నార్మల్ ప్రసవాలు జరిగేవి. అత్యవసర పరిస్థితుల్లో ఉట్నూర్‌తో పాటుగా, నార్నూర్, గాదిగూడ, జైనూర్, లింగాపూర్, సిర్పూర్ (యు), తిర్యాణి తదితర మండలాల నుంచి ఉట్నూర్ ఆస్పత్రికి రోగులు నిత్యం వస్తుంటారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరు కూడా సీజేరియన్ కాన్పులపై దృష్టి సారించలేదు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా జాధవ్ ఉపేందర్ బాధ్యతలు తీసుకున్న తర్వాతే ఉట్నూర్ ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు, సిజేరియన్ ఆపరేషన్ థియేటర్‌కి అవసరం అయ్యే పరికరాలు అందుబాటులో తీసుకరావడం, ఆర్థోపెడిక్ సర్జికల్ ఆపరేషన్ లు చేయడంతో పాటుగా ప్రత్యేక వైద్యనిపుణులు తీసుకరావడం పట్ల ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. ఇంతటి అత్యవసరమైన పరిస్థితుల్లోనే సీజేరియన్ కాన్పు చేశామని అన్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓల సహకారంతో ప్రత్యేక వైద్యుల ఆధ్వర్యంలో సీజేరియన్ కాన్పు విజయవంతంగా చేశామని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సీజేరియన్ కాన్పులు ఉట్నూర్ ఆస్పత్రిలో చేస్తామని ఆయన తెలిపారు. ఏజెన్సీ గర్భిణీ స్త్రీలు భయపడాల్సిన అవసరం లేకుండా ఈ అరుదైన ఘనతనే ఉదాహరణగా తెలిపారు. సీజేరియన్ కాన్పుకు శ్రమించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విధంగానే అంకిత భావంతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు తెలిపారు.

పనులను వేగవంతం చేయాలి : సిక్తా పట్నాయక్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మన ఊరు మన బడి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, విద్యా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమం కింద జిల్లాలో 37 మోడల్ స్కూల్‌లలో పనులను జనవరి 15లోగా పూర్తిచేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకం కింద పాఠశాలల్లో చేపట్టే మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, ప్రహరీ గోడ పనులను కూడా పూర్తిచేయాలని అన్నారు. వచ్చే నెలాఖరులోగా మోడల్ స్కూల్ ప్రారంభానికి బ్యూటిఫికేషన్‌తో సహా పూర్తిచేయాలని అన్నారు. పనులకు సంబంధించిన వివరాల రికార్డులను అప్లోడ్ చేయాలనీ అన్నారు. అదేవిధంగా రూ.30 లక్షలలోపు పనులను పూర్తిగా గ్రౌండింగ్ చేయాలని అన్నారు. పాఠశాలల్లో పెయింటింగ్, క్లినింగ్ వంటి పనులు చేపట్టాలని అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు క్షేత్ర పర్యటనను నిర్వహించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ మన ఊరు మన బడి పనులను సకాలంలో పూర్తిచేసి నివేదికలను యాప్‌లో పొందుపరచాలని అన్నారు. అదేవిధంగా బిల్లులను చెల్లించుటకు రికార్డులను అప్లోడ్ చేయాలనీ అన్నారు. 37 మోడల్ స్కూల్ పాఠశాలల పనులను త్వరగా పూర్తిచేయాలని అన్నారు. పూర్తయిన పనులకు సంబంధించి ఫోటోలను పంపించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి టి.ప్రణీత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అదనపు డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, గిరిజన, సాంఘిక సంక్షేమం, మున్సిపల్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.





అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 07 జనవరి 2023

'క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారు'

నవతెలంగాణ- జన్నారం

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మండల కేంద్రంలోని స్లేట్ పాఠశాల ప్రిన్సిపల్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పైడిపల్లి గార్డెన్‌లో ఆ పాఠశాల ఆధ్వర్యంలో మోటివేషన్ ఫర్ ఎస్ఎస్‌సి స్టూడెంట్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్, లైఫ్ కోచ్, బిజినెస్ స్ట్రాటజిస్ట్ వేణు కల్యాణ్ పాల్గొని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కలిగించారు. తల్లితండ్రుల, గురువుల పట్ల గౌరవం కలిగి ఉండాలని, సమాజంలో ఎలా నడుచుకోవాలో వివరించారు. ఉపాధ్యాయులు,విద్యార్థులకు భోజన వసతిని పూర్ణచందర్‌రావు కల్పించారని పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజన్ జూనియర్ కాలేజ్ హైదరాబాద్ డైరెక్టర్ సుశీల్, ఖుషి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడి బయట చిన్నారుల గుర్తింపుపై సర్వే

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని చింతగూడ, మద్దిమాడలో బడి బయట చిన్నారుల గుర్తింపుపై సీఆర్పీ మంతెన రమేశ్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మద్దిమాడ గ్రామంలో 15 నుంచి 19 వయస్సు గల డ్రాపౌట్ విద్యార్థులైన రాంబాబు, సురేశ్ అనే ఇద్దరిని గుర్తించారు. ఈ మేరకు వారి వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు, వారిని ఓపెన్ స్కూల్ ద్వారా చదువును కొనసాగించే విధంగా చర్యలు తీసుకోకున్నట్లు వివరించారు. 6 నుంచి 14 వయస్సు వరకు, 15 నుంచి 19 వయస్సు వరకు వేర్వేరుగా సర్వే చేసి బడి బయట వారిని గుర్తించి చదువుకునే విధంగా చర్యలు తీసుకోకున్నట్లు వివరించారు. ఈ సర్వేలో ఉపాధ్యాయులు రాజయ్య ఉన్నారు.

ఇరాక్‌లో జన్నారం మండల వాసి మృతి

నవతెలంగాణ- జన్నారం

ఇరాక్ దేశంలో మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎలకలపల్లి సాయిలు (45) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉపాధి, బతుకుదెరువు కోసం ఇతర దేశాలకు వెళ్లి అకాల మరణం చెందడం బాధాకరమని గల్ఫ్ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమన్న అన్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినా వలసలు కొనసాగుతునే ఉన్నాయని తెలిపారు. గల్ఫ్ సంక్షేమ బోర్డుతోనే గల్ఫ్ కార్మికులకు కొంతవరకైనా న్యాయం చేకూరుతుందని పేర్కొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీ 8వ వార్డు గద్దెరాగడిలో శుక్రవారం వార్డు ప్రజలకు చెత్తబుట్టలను కౌన్సిలర్ అలుగల శ్రీలత పంపిణీ చేశారు. వార్డు మహిళలకు తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం, ఎమ్మెల్యే చొరవతో ఇంటింటికి చెత్త బుట్టలను అందజేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి బంటు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన సీఐ



నవతెలంగాణ- కోటపల్లి

మండలంలోని అన్నారం గ్రామంలో శుక్రవారం కుంభం రాకేష్ రెడ్డి స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను చెన్నూరు రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై వెంకట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు.ఆటల్లో గెలుపోటములు సహజమని అన్నింటిని సమాన దృష్టితో చూడాలని తెలిపారు. అనంతరం కొద్దిసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎర్రోళ్ల రమేష్,క్రీడాకారులు, నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికునికి చేయూత

నవతెలంగాణ- జన్నారం

మండలం లోని రోటిగూడ గ్రామానికి చెందిన కుంట నగేష్ గత నెల దుబాయి (పుజీర) లో ప్రమాదవశాత్తు గాయపడ్డారు. చికిత్స చేయించుకునే స్తోమత లేకపోవడంతో స్పందించిన రోటిగూడ గల్ఫ్ సంక్షేమ సమితి సభ్యులు శుక్రవారం విరాళాలు సేకరించి రూ.51వేలను బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు. నాగేష్ దుబాయ్ నుంచి ఇంటికి రావడానికి పూర్తి ఖర్చునంత తామే భరిస్తామని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు సేపురి గోపాల్ మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లో గల్ఫ్ కార్మికులు అనేకమంది సమస్యలతో బాధపడుతున్నారని ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ బోర్డు ప్రకటించి కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాలజి శ్రీనివాస్, ఉప్పు మల్లేశం, శివనురి శ్రీనివాస్, జలపెల్లి మల్లారెడ్డి, ఉప్పు రాజారెడ్డి, సెపురి లక్ష్మణ్, కంచెర్ల గంగన్న, ఉప్పు సాయి కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

నూతన రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి భూ సర్వే

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్ర సమీపంలో 23వ గేటు వద్ద కొత్తగా నిర్మించ తలపెట్టిన అండర్ లైన్ బ్రిడ్జ్ నిర్మాణ స్థలాన్ని రైల్వే, రెవెన్యూ శాఖల అధికారులు శుక్రవారం పరిశీలించారు. కొత్తగా నిర్మించబోతున్న 23 గేటు సమీపంలోని సాగు భూముల సర్వే నంబర్లు రెవెన్యూ శాఖలో ఒక విధంగా రైల్వే శాఖలో మరో విధంగా ఉండడంతో ఏటూ తేలలేకపోయింది. బ్రాడ్ గేజ్ పనుల్లో బ్రిడ్జిలు నిర్మించినప్పటికీ నీళ్ల చేరి రైతులకు ప్రయాణికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు అధికారుల దృష్టి తీసుకొచ్చారు. భూమి సర్వే నెంబరు క్లియర్ అయిన తర్వాతనే బ్రిడ్జిలు నిర్మించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. పరిశీలించిన వారిలో ఆర్డిఓ రమేష్ రాథోడ్, జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం కరుణాకర్ రెడ్డి, మండల తహసిల్దార్ ఇమ్రాన్ ఖాన్, రైల్వే శాఖ అధికారులు శంకర్, శ్యాం బాబు తదితరులున్నారు.

డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్

నవతెలంగాణ -ఆదిలాబాద్ టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం జరిగిన పరీక్షల్లో పలువురు డిబార్ అయినట్లు కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అదనపు అధికారి డా.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పరీక్షల్లో రాష్ట్రంలో 18 మంది డిబార్ కాగా అందులో ఉమ్మడి ఆదిలాబాద్ నుండి 17మంది ఉన్నారని తెలిపారు. ఎవరైనా కాపీయింగ్ కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

బీజేపీ శక్తి కేంద్రాల సమావేశం

నవతెలంగాణ-వేమనపల్లి

మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ శక్తి కేంద్రాల పరిధిలోని బూత్ కమిటీల సమావేశం బీజేపీ మండల అధ్యక్షుడు బైస మల్లేష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బెల్లంపల్లి నియోజకవర్గ ఇంఛార్జి అన్నపూర్ణ సుదర్శన్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో గడప గడపకూ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. శనివారం బెల్లంపల్లిలో జరగబోవు పోలింగ్ బూత్ సభ్యులతో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్వహించే వర్చువల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అందే తిరుపతి, కార్పెత భూదయ్యా, కొండ్ర విలాస్ బీజేపీలో చేరారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు ఏట మధుకర్, తలండి రమేష్, ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, కొండ రవి, ఏనుముల వెంకటేష్, స్వామి, కుబిడే అంజి, దొబ్బల శంకర్, భీమేష్, చౌదరి మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్‌ల పట్ల ప్రభుత్వాల వైఖరి మారాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్



నవతెలంగాణ- మంచిర్యాల

దేశవ్యాప్తంగా అమలవుతున్న వివిధ స్కీముల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సమంజసంగా లేదని, స్కీములను ప్రైవేటీకరణ చేస్తే సహించమని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం దేశ వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు అవుతుందని, ఈ కాలంలో స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్కీమ్ వర్కర్లను చట్ట పరిధిలోకి తీసుకురావడానికి నిరాకరిస్తుందని, వారి సంక్షేమం గాలికొదిలేస్తూ స్కీములను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని తెలిపారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం, గ్రామీణ ఉపాధి హామీ, ఎన్‌హెచ్ఎం వివిధ స్కీంలు, ఐకేపీ వీవోఏ, సర్వశిక్షా అభియాన్ తదితర స్కీం వర్కర్ల కోసం సీఐటీయు ఆధ్వర్యంలో అనేక పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు. ఈ పోరాటాల ఫలితంగా 2013మే నెలలో 45ఇండియన్ లేబర్ కన్ఫ్యూరెన్స్ స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, స్కీంల ప్రయివేటీకరణ ఆపాలని తీర్మాణం జరిగినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్,తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, ఐకేపీ వీవోఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుమార్, లక్ష్మణ్, కోశాధికారి దుర్గం రాములు, జిల్లా కమిటీ సభ్యులు లచ్చన్న, దాస్,శ్రీనివాస్,లింగన్న, తుకారాం, తిరుపతి, లక్ష్మి పాల్గొన్నారు.

తాండూర్ :స్కీం వర్కర్లకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా నాయకులు దాగాం రాజారాం కోరారు. శుక్రవారం తాండూరు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీం వర్కర్లు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రామీణ ఉపాధి హామీ, ఎన్‌హెచ్ఎం, ఐకెపి వీఓఏలు, సర్వ శిక్ష అభియాన్ తదితర 72 స్కీముల్లో దేశవ్యాప్తంగా పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు వెంటనే వీరి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు బొల్లం రాజేశం, అంగన్వాడి నాయకులు సత్యవతి, లీలారాణి, సరిత, పావని, శారద, లక్ష్మి, సుజాత, శారద, బురుసా గణపతి తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్:కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు గడిచినప్పటికీ స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కారంలో విఫలమైందని సీఐటీయూ జిల్లా కోశాధికారి సునీత, నాయకుడు సక్కు అన్నారు.ఉమ్మడి నార్నూర్, గాదిగూడ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఆర్క మోతీరాంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కీమ్‌లకు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని కనీస వేతనం రూ.26000 చెల్లించాలని డిమాండ్ చేశారు.ఒక వైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుంటే మరో వైపు చాలీ చాలని వేతనాలతో స్కీం వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి,ఆశాలు సుభద్ర, రత్నవిజయలక్ష్మి,రాధ, మీరా బాయి,ఇంద్ర,సునీత, కుంత బాయి,దూర్పత తదితరులు ఉన్నారు.



తాండూర్‌లో...

ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీలేదు

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

నవతెలంగాణ - మంచిర్యాల

ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ నుండి అందుతున్న వివిధ సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వార్డులలో నెలకొని ఉన్న దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ఆదర్శవంతమైన అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకం అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, సింగిల్ విండో చైర్మన్ సందేల వెంకటేష్, విశ్వనాథ ఆలయ కమిటీ చైర్మన్ సిరిపురం శ్రీనివాస్, గూడెం ఆలయ డైరెక్టర్ కారుకూరి చంద్రమౌళి, పట్టణ



పార్టీ అధ్యక్షులు పల్లపు తిరుపతి, జూపాక సుధీర్, సాయి కృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని క్రీడాకారులకు దేవాపూర్ ఎస్ఐ విజయేందర్ క్రికెట్ కిట్లను అందించారు. శుక్రవారం దేవాపూర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా యువకులకు ఎస్ఐ క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత చెడు మార్గంలో నడవకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. యువతను ప్రోత్సహించడంలో పోలీసులు కీలక పాత్ర వహిస్తున్నారని వివరించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాలకష్ణ, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్, సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అంశాలపై అవగాహన

నవతెలంగాణ-నస్పూర్

ఎలక్ట్రికల్ సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అంశాలపై శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి అధ్యక్షతన సింగరేణి గెస్ట్ హౌస్ సీసీసీలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డీఎంఎస్ (ఎలక్ట్రికల్)ఆనంద్వేల్ హైదరాబాద్-2, డిడిఎంఎస్ (ఎలక్ట్రికల్) గౌరవ్ లడ్డా పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఉపరితల, భూగర్భ గనులలో ఎలక్ట్రికల్ ప్రమాదాలను గత కొన్ని సంవత్సరాలుగా నివారించడం చాలా సంతోషకరమైన విషయమని, విభాగాలలో ఈ పనిచేస్తున్న అధికారులు ఉద్యోగులు సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ లను పాటించడం చాలా సంతోషకరమైన విషయమని తెలియజేశారు. ఉద్యోగులను కాపాడడంలో సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ లు చాలా ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ లను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆనంద్ వేల్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా ప్రమాదాలను నివారించడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని, ఎలక్ట్రికల్ ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్‌లు చాలా బాగున్నాయని ఇకముందు కూడా ఇటువంటి ప్రణాళికను అనుసరిస్తూ ప్రమాద రహిత సింగరేణిగా ఏర్పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ రమేష్‌బాబు, ఏరియా రక్షణాధికారి గోళిక మల్లేష్, మేనేజర్ రవి కుమార్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేష్, గని రక్షణాధికారి ఏఆర్ సాహెని, ఇతర అధికారులు, ఎలక్ట్రికల్ విభాగ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య కోసమే టీఎల్‌ఎం మేళా



నవతెలంగాణ- నస్పూర్

ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు నాణ్యమైన విద్యను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి పోచయ్య అన్నారు. శుక్రవారం జడ్‌పిహెచ్ఎస్ నస్పూర్ లో తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా కరోనా కారణాలతో పిల్లలకు చదువులు సక్రమంగా కొనసాగిపోవడం వల్ల విద్యలో వారు సాధించాల్సిన నైపుణ్యాలు సాధించలేక పోవడంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు సులభతరంగా నైపుణ్యాలు అందే విధంగా టిఎల్ఎం(టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) లను ఉపయోగించి బోధించడమే ఈ తొలి మెట్టు యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ ప్రదర్శనలో ఈవీఎస్, ఆంగ్ల గణితం, తెలుగు విభాగాలలో 13 పాఠశాల నుంచి 71 ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, రిసోర్స్ పర్సన్ మల్లికార్జున్, మహేశ్వర్, రవి, శంకర్ నోడల్ ఆఫీసర్ రాజన్న,సుభాంగి, కమల, ప్రేమ, శ్రీనివాస్, రాసపల్లి రవి, రఘుపతి రెడ్డి, పున్నం తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులే దేవుళ్లు

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

నవతెలంగాణ-తలమడుగు

మారుమూల గిరిజన గ్రామమైన పల్సి-బి తాండ గ్రామంలో నారాయణ బాబా 27వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడారు. తల్లిదండ్రులే దేవుళ్లని తెలిపారు. బోథ్ తాలుకాలోని బరంపూర్, తలమడుగు, కోసాయి, కజ్జర్ల ఇలా అనేక ఆలయాలకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల మంజూరు చేయడం జరిగిందన్నారు. భక్తి భావన కలిగిన వారే క్రమశిక్షణతో నడుచుకుంటారన్నారు. పల్సి-బి తాండలో గ్రామంలో నారాయణబాబా ఆలయం నిర్మించడంతో చుట్టుపక్కల గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, ఆర్డీఓ రమేష్ రాథోడ్, నారాయణ బాబా సంస్థాన్ అధ్యక్షులు జాదవ్ కిషన్, బోథ్ నియోజక వర్గ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, సర్పంచులు అంగూర్, ఆనంద్, రంబాయి, రమేష్ రెడ్డి, సుభాష్ ,ఎంపీటీసీ చంటి, మాజీ సర్పంచ్ మణిరాం, పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వన్నెల అశోక్, ఎండి రఫీక్, గ్రామస్తులు అవినాష్, నారాయణ, సునీల్, నవీన్, నరేందర్ వివిధ గ్రామాలను వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

- ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకురాలు హరిత

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ ప్రగతి శీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 11న హైదరాబాద్ లో జరిగే ప్రథమ మహా సభలను జయప్రదం చేయాలని ఐఎఫ్ టియు రాష్ట్ర నాయకురాలు హరిత అన్నారు. శుక్రవారం ముధోల్‌లో సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 11న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రగతి శీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నారని, కేసీఆర్ వారి వేతనాల పెంపుదల,పర్మినెంట్ చేయడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు.ఇతర రాష్ట్రాలలో కేజీబివి లలో వేతనాలు మెరుగ్గా ఉన్నాయని అన్నారు. బంగారు తెలంగాణలో కనీసం వర్కర్స్ కు గుర్తింపు కార్డులు లేవని



ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కవిత,లక్ష్మీ,కల్యాణి,గోదావరి,భూమవ్వ, లత తదితరులు పాల్గొన్నారు.

నేతకాని ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్లు విడుదల



నవతెలంగాణ- దండేపల్లి

దండేపల్లి మండలం నేతకానీ మండల సంఘం ఆధ్వర్యంలో నేతకాని ఆత్మీయ ఆత్మగౌరవ సమ్మేళనం గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నేతకాన్ని మహర్ సమన్వయ కమిటీ సభ్యులు గొల్ల రాజమల్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని నేతకాని మహర్ కులస్తులు ఐక్యత చాటేందుకు ఈనెల 22న గోదావరిఖనిలోని ఎన్టీపీసీలో జరుగనున్న ఆత్మీయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమ్మేళనానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కుల బాంధవులందరూ హాజరు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జాడి రమేష్, జాడి సాగర్, టేకుమట్ల చంద్రయ్య, సాయిని సోము, బోర్లకుంట పోచన్న, జాడి సత్యం, రత్నం మల్లేష్, సాయికుమార్ పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

నవతెలంగాణ -ముధోల్

ఈనెల 18వ తేదీ నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ శ్యాంసుందర్ అన్నారు. శుక్రవారం మండల అభివద్ధి కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ సూపర్‌వైజర్లకు ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామంలో 18వ తేదీ నుండి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమానికి సర్పంచ్లు అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యాంప్ ఏర్పాటు చేసి విజయవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు, వైద్యులు డాక్టర్ ఆకాష్ సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు

అర్హులకు డబుల్ బెడ్‌రూంలు మంజూరు చేయాలి

నవతెలంగాణ- బాసర

అర్హులైన లబ్ధిదారులకు డబల్ బెడ్ రూంలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బైంసా- నిజామాబాద్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి ఎనిమిదేళ్ల గడుస్తున్నా ఇళ్ల నిర్మాణానికి నోచుకోవడం లేదని తెలిపారు. నిరుపేదలు గూడు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి స్థలం ఉన్న నిరుపేదలకు రూ.3 లక్షల నగదు హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగ నోటిఫికేషన్ అంటూ నిరుద్యోగులను ఉసురు తీసుకుంటున్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసి పోలీసులను భర్తీ చేసి తమ సమస్యల కోసం ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులను ఉసిగొలుపుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గంటపాటు నిర్వహించిన రాస్తారోకోతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్,శ్రీను పటేల్, బీజేపీ కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 07 జనవరి 2023

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలో పాల్వాయి పురుషోత్తంరావు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలని, క్రీడా స్ఫూర్తిని అలవరుచుకొని ముందుకు సాగాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండడంతో పాటు సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జునుగరి మధుకర్, ఆరెకుల సంఘం తాలుకా అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సిరిపురం భీమయ్య నాయకులు గణపురం నాగేష్, కుకుడె వెంకన్న, భీమయ్య, వగాడి కిశన్, దెబ్బటి మహేష్, అనంతరావు, కర్న మహేష్, దుర్గం శ్రీకాంత్, శోభన్, సంతోష్ పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

కాగజ్‌నగర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.లక్ష్మినరసింహం తెలిపారు. కళాశాలలోని మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత విభాగం ఇన్ చార్జ్ క్రిష్ణవేణి మాట్లాడుతు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీయడమే లక్ష్యంగా ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల అధ్యాపకులు క్రిష్ణవేణి, శారద, రజిత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి.జనార్ధన్, ఎం.రాజేశ్వర్, కోటేశ్, ప్రేమ్‌కుమార్, రోజ్ మేరి పాల్గొన్నారు.



విద్యారంగం సమస్యలపై పోరాడే సంఘం టీఎస్‌యూటీఎఫ్



నవతెలంగాణ - సిర్పూర్(టి)

ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి టీఎస్‌యూటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని, సమస్యలపై స్పందించేది కేవలం ఒకే ఒక సంఘం టీఎస్‌యూటీఎఫ్ అని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఇందూరావు, జిల్లా కార్యదర్శి హేమంత్ షిండే అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీపీఎస్ పాఠశాలలో 2023 సంవత్సరం క్యాలెండర్, డైరీని ఎంఈఓ సోమయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల సమస్యలపై స్పందించే సంఘం టీఎస్‌యూటీఎఫ్ అని పేర్కొన్నారు. కేవలం ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా సామాజిక స్పృహ కలిగిన సంఘంగా అనేక సామాజిక కార్యక్రమాల్లో ముందుంటుందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరీష్, రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు రామ్మోహన్, అనూష, కోశాధికారి వంశీ, మండల బాధ్యులు మహేష్, మునేందర్, అనిత, సౌమ్య పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



- పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్

నవతెలంగాణ - రెబ్బెన

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మిషన్ భగరీథ కార్మికుల సమావేశం గోలేటిలోని పంప్‌హౌజ్(భీమన్న దేవాలయం దగ్గర)లో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ పాల్గొని మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ కార్మికులు చాలీచాలని వేతనాలు తీసుకుంటూ నిత్యం ప్రజలకు తాగునీరు అందించడంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. మిషన్ భగీరథలో నిత్యం పంప్ ఆపరేటర్లు, ఫిట్టర్స్, లైన్‌మెన్‌లు, ఎలక్ట్రీషన్‌లు, స్వీపర్లు పనిచేస్తున్నారని, కార్మికులందరికి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి కార్మిక చట్టాలను అమలు చేయకుండా శ్రమదోపిడీకి గురిచేస్తున్నారన్నారు. వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. ప్రతినెల 5 లోపు వేతనాలు చెల్లించాలని, 8గంటల పని విధానం కల్పించాలని, ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండీ రెహీం, మిషన్ భగీరథ కార్మికులు శ్రీనివాస్, రాకేష్, ఆనంద్, మహేందర్, లింగయ్య పాల్గొన్నారు.

హైమన్‌డార్ఫ్, ఎలిజబెత్ వర్ధంతిని విజయవంతం చేయాలి



జైనూర్ : హైమన్‌డార్ఫ్, బీటీఎలిజబెత్ 36వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం శేషునారాయణ్ అన్నారు. శుక్రవారం లింగాపూర్ మండలంలో నాయకులతో కలిసి 36వ వర్ధంతి కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శేషునారాయణ్ మాట్లాడుతూ హైమన్‌డార్ఫ్, బేటీఎలిజబెత్ దంపతులు అడవిబిడ్డల జీవన స్థితిగతులపై అధ్యయనం చేయడానికి తమ జీవితాన్ని ధారపోసి ఆదివాసుల గుండెల్లో శాశ్వతంగా నిలిచారన్నారు. 1909లో ఆస్ట్రేలియాలో జన్మించి ఆదివాసులతో మమేకమయ్యారని తెలిపారు. మహానీయుల వర్ధంతి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరైన విజయవంతం చేయాలని కోరారు. యావత్ ఆదివాసీ సమాజానికి ఐటీడీఏ ద్వారా హక్కులు కల్పించిన మహనీయుడని గుర్తు చేశారు. కార్యక్రమంలో మెస్రం భాజీరావు పటేల్, పెందూర్ మహదు, అర్క సుదర్శన్, సక్రుబాయి, రూపాబాయి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన

కౌటాల : సేంద్రియ ఎరువుల ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువుల అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. సేంద్రియ ఎరువులు వాడడం వల్ల పంటల సాగు పెరగడంతో పాటు పంటలకు చీడపీడలు సోకకుండా ఉంటాయన్నారు. పంటల్లో రసాయన ఎరువులు ఎక్కువగా వాడడంతో భూమిలోని భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గుతుందని, సేంద్రియ ఎరువులు వాడడం వల్ల పంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. సేంద్రియ ఎరువుల తయారీ అన్ని గ్రామ పంచాయతీల్లో కొనసాగుతుందని, రైతులకు అవగాహన కల్పించి సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గుచూపాలన్నారు. కార్యక్రమంలో చింతలమానెపెల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఎంపీడీఓ అబ్దుల్ నస్రుల్లాఖాన్, ఏఓ రాజేష్, ఏఈఓలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ అన్నారు. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనపై శుక్రవారం కలెక్టర్ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్‌లు హేమంత్ బోర్కడే, రాంబాబుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి, అభిరుచి కలిగించేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. మొదటిసారిగా రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించడానికి జిల్లాను ఎంచుకోవడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన సెయింట్ థామస్ పాఠశాలలో జనవరి 9 నుండి జనవరి 11 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జనవరి 9న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభిస్తారని, విద్యా శాఖ నుండి ఉన్నతాధికారులు పాల్గొంటారని, ఏర్పాట్లు ఘనంగా చేయాలని సూచించారు. 33 జిల్లాల నుండి వచ్చే విద్యార్థులకు, గైడ్ టీచర్లకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలని తెలిపారు. ముఖ్యంగా వచ్చిన వారికి వసతి, భోజన సదుపాయంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అన్ని కమిటీల సభ్యులు, అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి, రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వచ్చిన వారికి వసతి, రవాణా సౌకర్యం వంటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శన జరిగే మూడు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు, ఆరోగ్యపరమైన సమస్యల నివారణకు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డిఎంఅండ్‌హెచ్‌ను ఆదేశించారు. పాఠశాలలో ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచాలని ఫైర్ సర్వీస్ అధికారిని ఆదేశించారు.

డీఈఓ డా. ఏ.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన గురించి ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లను వివరించారు. ఇటీవలే రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధ పర్యవేక్షణ చేశారని, ఏర్పాటు చేసిన సదుపాయాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారని తెలిపారు. వివిధ కమిటీలను ఉన్నత పాఠశాలల అధ్యక్షతన ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణ బాధ్యతను మండల విద్యాధికారులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఆకర్షణ కోసం 2 బెలూన్లు, 2 ప్రత్యేక టెలిస్కోపులు ఏర్పాటు చేసి, వచ్చిన విద్యార్థులకు, ఉపాధ్యాయులు రాత్రిపూట ఆకాశాన్ని వీక్షించే విధంగా సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శన జరిగే మూడు రోజులు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. ట్రిబుల్ ఐటీ బాసర నుండి ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రదర్శనల న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ - మంచిర్యాల

ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పరీక్షలకు సిద్ధమైన అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయానికి ప్రభుత్వం బాధ్యత వహించి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఎన్నడూ లేని విధంగా పరుగు పందెం నిర్వహించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పరీక్షల సమయంలో ఏడు తప్పుడు ప్రశ్నలను ఇచ్చారని, దీనిపై తెలంగాణ హైకోర్టు విద్యార్థులకు ఏడు మార్కులు కలపాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. తక్షణమే దీనిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అర్హత సాధించిన అభ్యర్థులకు మెయిన్స్ రాసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రిలిమ్స్ ప్రాథమిక మల్టిపుల్ ఛాయిస్ పరీక్షలు తప్పుగా వచ్చిన ఏడు ప్రశ్నలకు న్యాయస్థానం ఆదేశాల మేరకు మార్కులు కలపాలని కోరారు. లేనియెడల ఈ నెల 9న ప్రగతి భవనన్ ముట్టడించనునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు మిట్టపల్లి తిరుపతి, పీడీఎస్‌యూ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, తిరుపతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల సన్నీగౌడ్, జిల్లా నాయకులు రాహుల్, వంశీ, యూసఫ్, చరణ్ పాల్గొన్నారు.

శ్రీమంతుల కోసమే విదేశీ యూనివర్సిటీలు

- అబద్ధాలు బీఆర్ఎస్ అధికారిక భాష
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

దేశంలో ఉన్న యూనివర్సిటీలను పట్టించుకోకుండా, అభివృద్ధి చేయకుండా, మౌళిక సదుపాయాలు కల్పించలేక కేంద్ర ప్రభుత్వం విదేశీ యూనివర్సిటీలకు అనుమతి ఇస్తోందని, పేదలకు ఉన్నత విద్యను దూరం చేయడానికి చూస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బహుజన రాజ్యాధికార యాత్ర రెండో విడతలో భాగంగా మండలంలోని చెడ్వాయి, ఎల్లూరు, పెంచికల్‌పేట్, అగర్‌గూడ గ్రామాల్లో పర్యటించారు. ఎల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ పేరుతో పేదల భూములు గుంజుకొని రైతులు ఆత్మహత్యలు చేసుకోవడానికి కేటీఆర్, కేసీఆర్ కారణమని ఆరోపించారు. పేదల ఇండ్లు, భూములు బలవంతంగా గుంజుకోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. కామారెడ్డి రైతులకు న్యాయం చేసి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యరంగంలో తెలంగాణ నెంబర్ వన్ అంటున్నారని, సంగారెడ్డిలో వ్యక్తి చనిపోతే మార్చురీలో పెట్టి 15 రోజుల వరకు బంధువులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పత్తి రైతులకు న్యాయం చేయాలని, క్వింటాల్ పత్తికి రూ.15వేల ధర కల్పించాలని, రైతుబంధు ఇవ్వకుండానే ఇచ్చామని, వందల కోట్లు విడుదల చేశామని చెబుతున్నారని, బీఆర్ఎస్ పార్టీవి అన్ని అబద్ధాలేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్ మీటింగులు ఎక్కడ జరిగిన ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నానన్నారు. 2008 డీఎస్‌సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని, హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఉద్యోగాలకు బీఇడీ చదివిన వారికి అవకాశం కల్పించాలని, పోలీసు నియామకాలను రద్దు చేసి పైస్థాయి ఉద్యోగాలకు బీఇడీ చదివిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. సిర్పూర్ నియోజకవర్గంలో సిర్పూర్ ప్రజలకింక స్వాతంత్ర్యం రాలేదని, 9 ఏండ్ల పాలనలో పాఠశాలలను బాగుచేయలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో యూనిఫామ్‌లు ఇవ్వలేదని, మన ఊరు మన బడి పథకం కింద పనుల్లో నాణ్యత లోపించిందని విమర్శించారు. ఎమ్మెల్యే అనుచరులు భూఆక్రమణలు చేస్తున్నారని, బహుజన రాజ్యంలో భూములను పేదలకు పంచుతాని తెలిపారు. దహెగాం, పెంచికల్‌పేట్ మధ్యగల పెద్దవాగు వంతెన అప్రోచ్ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని, పెద్దవాగు వరదల వల్ల పంటలు మునిగిన రైతులను ఆదుకోవాల్సిన ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముంపుకు గురైన పంట పొలాలను సర్వేతోనే సరిపెట్టారన్నారు. నియోజకవర్గంలో ఏ ఊరికి వెళ్లిన రోడ్డు సరిగా లేదని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్‌హుస్సేన్, నియోజకవర్గ మహిళా నాయకురాలు జ్యోతి, నియోజకవర్గ కార్యదర్శి దుర్గం ప్రవీణ్, మండల నాయకులు పాగిడి ఆశన్న, చిత్రు పాల్గొన్నారు.

ఎంసెట్ శిక్షణపై అధ్యాపకులు పట్టు సాధించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న సైన్స్ అధ్యాపకులు ఎంసెట్ శిక్షణపై పట్టు సాధించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సరళమైన విధానాలతో ఆకట్టుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో సైన్స్ అధ్యాపకుల కొరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఎంసెట్ పరీక్ష పట్ల ఆసక్తిని కనబర్చడం లేదని, విద్యార్థులను ఆకట్టుకునేలా ప్రత్యక్షంగా నేర్చుకునే పద్ధతులను, 'జాయ్ ఫుల్ లెర్నింగ్' రీతిలో బోధించడానికి అధ్యాపకులు ముందుండాలని అన్నారు. గణితం, బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల అధ్యాపకులకు రెండు పూటలా బోధనా రీతులపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. మాధ్యమిక విద్యాధికారి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి మంచి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా ప్రిన్సిపాళు నైతం శంకర్, రాందాస్, కళ్యాణి, లక్ష్మణ్‌రావ్, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

8న ఉమ్మడి జిల్లా అండర్-19 బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

నవతెలంగాణ - రెబ్బెన

ఈ నెల 8న గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి హైస్కూల్ మైదానంలో జూనియర్స్(అండర్-19) బాల్‌బ్యాడ్మింటన్ బాలురు, బాలికల జట్ల ఎంపిక ఉంటుందని ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి కె నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఈ నెల 13, 14వ తేదీల్లో ఖమ్మం జిల్లా బోనగల్లులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎంపిక పోటీలో పాల్గొనే బాలబాలికలు వయసు ధృవీకరణ పత్రం తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం గోలేటి షార్ప్‌స్టార్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశర్లు ఫోన్ నెంబర్ 9866652249ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు క్రాసింగ్ ఇవ్వాలని వినతి



నవతలెంగాణ - రెబ్బెన

ఎన్‌హెచ్ 363 నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా శుక్రవారం రెబ్బెన గ్రామ పంచాయతీ పరిధిలోని పుంజుమేరగూడ, సింగిల్‌గూడ, ఇందిరానగర్ గ్రామ పంచాయతీలోని నక్కలగూడ గ్రామాలకు రోడ్డు క్రాసింగ్(ఓపెన్ నీడియన్) ఇవ్వాలని ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ రవీందర్‌రావును ఆయా గ్రామాల ప్రజలు కోరారు. దాదాపు 4 వేల జనాభా కలిగిన ఈ ప్రాంతంలో సర్వీసెస్ రోడ్డు కలిగిన క్రాసింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రముఖ గ్రామదేవత పోచమ్మ దేవాలయం, ప్రాముఖ్యత కలిగిన హజ్రత్‌ఫాతిమా పీరీల బంగ్లా కూడా పుంజుమేరగూడలో ఉందని తెలిపారు. అలాగే వ్యవసాయ పనుల కోసం ఎడ్ల బండ్లు, ఆటోలు, పాఠశాలల బస్సులు, అత్యవసర 108 వాహనం వెళ్లడానికి రోడ్డు క్రాసింగ్ అవసరం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొమ్మినేని శ్రీధర్, మోడెం సుదర్శన్‌గౌడ్, అజయ్‌జైస్వాల్, దుర్గం తిరుపతి, దుర్గం భరద్వాజ్, గ్రామపెద్దలు వడాయి గణపతి, శివరాం, కాంతారావు, పాపయ్య, బాలాజీ, నగేష్, గౌత్రె శంకర్, నానాయ్య, ఆయా గ్రామాల ప్రజలు, ఎన్‌హెచ్ ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ గూడాల్లో జెండాను ఆవిష్కరించాలి



నవతెలంగాణ - కౌటాల

ఆదివాసీ కొలావార్, మన్నెవార్ల ఆత్మగౌరవ దినోత్సవం 21వ భీమదేవర జెండా పండుగను ఈ నెల 8న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా అన్ని ఆదివాసీ గూడాల్లో జెండాను ఆవిష్కరించి పండుగను జరుపుకోవాలని జిల్లా అధ్యక్షుడు మెర్పెల్లి బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భీమదేవర కొలావార్ భవనంలో భీమదేవర జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ కొలావార్, మన్నెవార్లు వెనుకబడి పోతున్నారని, ఆదివాసీ నియమ నిబంధనలు పాటిస్తూ జెండా పండుగను సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులకు వెంటనే గిరిజనబంధు అమలు చేయాలని, అర్హులైన వారికి డబుల్‌బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని, 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, గిరిజన గ్రామాలను గుర్తించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఆదివాసులకు ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ద్వారా అన్ని శాఖల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారుపెల్లి పోచం, రాష్ట్ర కార్యదర్శి మెర్పెల్లి సదాశివ్, డబ్బ బాపు, సంఘం నాయకులు భీమయ్య, హన్మంతు, యువజన సంఘం నాయకులు ఉన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - కౌటాల

పీఆర్‌టీయూటీఎస్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కాలసూచిక చాలా ముఖ్యమైనదని, అందులో ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వర్తించడానికి క్యాలెండర్ ఉపయోగపడుతుందన్నారు. ప్రయివేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉందని, పేదరికంతో బాధపడుతూ ఆర్థిక స్తోమత లేనివారే ప్రభుత్వ పాఠశాలలకు వస్తుంటారని, వారిని తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతి, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎల్ రాజు, గణపతి, మాజీ ఎంపీపీ వెంకన్న, బీఆర్ఎస్ యువజన సంఘం మండలాధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, రాంచందర్, సంఘం నాయకులు, ఉపాధ్యాయులు రాంచందర్, రాజు, మానస, రమాదేవి, శైలజ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINICIPAL JUNIOR CIVIL JUDGE AT ADILABAD
O.S.NO. 103 OF 2020

Between:-
Bank of Baroda, Branch Adilabad, represented by it's Branch Manager
...Plaintiff

AND

Mr. Shaifuddin and another
...Defendants

To:
Mr. Shaifuddin S/o. Waheeduddin, R/o H.No.2-3-66, Bokkalguda, Adilabad-504001.
...Defendant No.1

Take notice that the Plaintiff Bank has filed the above case for the recovery of loan amount against the Defendants 1 and 2 and the same is posted on 13-01-2023 for your appearance. Hence you are hereby directed to appear in person or through an Advocate on the above said date at 10.30 A.M., in the Hon'ble Court, failing which the matter will be heard in your absence.

(BY ORDER OF THE COURT)
Adilabad
Dated:14-12-2022

(C.MRUTHYUNJAYA)
B.com., L.L.B.,
Counsel for Plaintiff,
Brahmanwada, Adilabad.
Cell No. 9848375236

పులికుంటకు సర్వీస్ రోడ్డు, బోర్‌వెల్ మంజూరు చేయాలి

ంబ్బెన : పులికుంట గ్రామంలో ఎన్‌హెచ్ రహదారి నిర్మాణంలో భాగంగా పులికుంటకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, బోర్‌వెల్ మంజూరు చేయాలని ఎన్‌హెచ్ పీడీ రవీందర్‌కు ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, గ్రామ సర్పంచ్ బుర్స పోచమల్లు, ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.